“మీరు నన్ను వెదకిన యెడల, పూర్ణ మనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయు నెడల, మీరు నన్ను కనుగొందురు.”

# దేవుని తెలిసికొనుట ఎట్లు?

# దేవుని తెలిసికొనుట ఎట్లు?

జీవితములో దేవుని తెలిసికొనుట గొప్ప అనుభవమైన విషయము. పూర్ణ హృదయముతో వెదకువారికి ఆయన బహిరంగముగా దొరుకుటకు తనంతట తాను మనకు బయలుపర్చుకొనుట ఎంతో అద్భుతమైన విషయము; అయినను ఆయన దాచబడిన మర్మముగా నుండెను.

దేవున్ని నిజముగా తెలిసికొనగోరువారే యీ చిన్న పుస్తకములో వ్రాయబడిన దేవుని హృదయము నుండి వెలువడిన ఆయన వాక్యములను చదువనాశించెదరు. అనేక శతాబ్దముల నుండి ఎంతో అద్భుతముగా దాచబడి, తన ఆత్మపూర్ణులైన అనేకమంది ద్వారా యీ గ్రంథమును వ్రాయించి, సైతాను కుతంత్రముల నుండి దేవుడు కాపాడెను.

నీ స్వంత మార్గమునను సరించి నడువక నిజముగా దేవునికి లోబడి తిరిగినచో, ఆయన ఆత్మ నీలో నివసించును. ఆయన వాగ్దానములను అనుసరించి విధేయతతో నడిచిన వారిని ఏదియు వేరుచేయలేదు. అప్పుడు ఆయన నీ దేవుడైయుండును. నీవైతే ఆయనకు నిత్య స్వాస్థ్యముగా నుందువు. ఎంతో వెలపెట్టి ఆయన నిన్ను కొనియున్నాడు. కాబట్టి ఆయన నీతో ఎల్లప్పుడు సహవాసము గలిగి యుండగోరుచున్నాడు.

---

All scriptures are taken from the Telugu Bible with permission from the Bible Society of India.

# ఒకే ఒక సత్యవంతుడైన దేవుడు

మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా. నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను.

*– ద్వితీయోపదేశకాండము 6:4బి.5*

ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడు; ఆయన భూమిని కలుగజేసి దాని సిద్ధపరచి స్థిరపరచెను. నిరాకారముగానుండునట్లు ఆయన దాని సృజింపలేదు. నివాసస్థలమగునట్లుగా దాని సృజించెను. ఆయన సెలవిచ్చునదేమనగా – యెహోవాను నేనే మరి ఏ దేవుడును లేదు.

*– యెషయా 45:18*

అప్పుడు లోకమందున్న జనులందరును, యెహోవాయే దేవుడనియు, ఆయన తప్ప మరి ఏ దేవుడును లేడనియు తెలిసికొందురు.

*–1 రాజులు 8:60.*

మీరు తెలిసికొని నన్ను నమ్మి నేనే ఆయనని గ్రహించునట్లు మీరును నేను ఏర్పరచుకొనిన నా సేవకుడును నాకు సాక్షులు. నాకు ముందుగా ఏ దేవుడును నిర్మింపబడలేదు. నా తరువాత ఏ దేవుడు నుండడు. నేను నేనే యెహోవాను, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు. *– యెషయా 43:10,11*

భూదిగంతముల నివాసులారా, నావైపు చూచి రక్షణ పొందుడి. దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు. *– యెషయా 45:22*

# దేవుడు దయాళుడును, కృపయును గలవాడు

యెహోవా దయాదాక్షిణ్యపూర్ణుడు, దీర్ఘశాంతుడు. కృపా సమృద్ధి గలవాడు. భూమి కంటే ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయన యందు భయభక్తులు గలవారి యెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది. –కీర్తనలు *103:8,11*

ఆయన నిబంధనను గైకొనుచు ఆయన కట్టడల ననుసరించి నడచుకొను వారి మీద, ఆయన కృప యుగయుగములు నిలుచును.

–కీర్తనలు *103:17ఎ,18బి*

తన స్వాస్థ్యములో శేషించిన వారి దోషమును పరిహరించి, వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుట యందు సంతోషించువాడు గనుక నిరంతరము కోపముంచడు.

–మీకా *7:18*

యెహోవా కృపగలవాడు. ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది గనుక మనము నిర్మూలము కాకున్నవారము. అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది. నీవు ఎంతైన నమ్మదగిన వాడవు –విలాపవాక్యములు *3:22,23*

ఆయన బాధపెట్టినను తన కృపాసమృద్ధిని బట్టి జాలిపడును. – విలాపవాక్యములు *3:32*

యెహోవా దయాళుడు, ఆయన కృప నిరంతరముండును.

–1 దినవృత్తాంతములు *16:34*

# దేవుడు నిన్ను ప్రేమించును



చాలాకాలము క్రిందట యెహోవా నాకు ప్రత్యక్షమై యిట్లనెను – శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను. – *యిర్మీయా 31:3*

నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును; రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములే గాని హానికరమైనవికావు. – *యిర్మీయా 29:11*

తండ్రి తన కుమారుల యెడల జాలి పడునట్లు యెహోవా తన యందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును. – *కీర్తనలు 103:13*

మన యెడల దేవునికి ఉన్న ప్రేమను మన మెరిగినవారమై దాని నమ్ముకొనియున్నాము; ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము.

–*1 యోహాను 4:16ఎ,19*

నీ దేవుడైన యెహోవా నీ మధ్య ఉన్నాడు. ఆయన శక్తిమంతుడు, ఆయన మిమ్మును రక్షించును. ఆయన బహు ఆనందముతో నీయందు సంతోషించును. నీ యందు తన కున్న ప్రేమను బట్టి శాంతము వహించి నీ యందలి సంతోషము చేత ఆయన హర్షించును.

–*జెఫన్యా 3:17*

# దేవున్ని ఎరుగుటయే మన జీవితములో గొప్ప విషయము

....... అయితే తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు.

– దానియేలు *11:32 బి*

అతిశయించువాడు దేనిని బట్టి అతిశయింప వలెననగా, భూమి మీద కృప చూపుచు నీతి న్యాయములు జరిగించుచుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను వరిశీలనగా తెలిసికొనుటను బట్టియే అతిశయింపవలెను; అట్టివాటిలో నేనా నందించువాడనని యెహోవా సెలవిచ్చుచున్నాడు. –యిర్మీయా *9:24*

ఆయన శాసనములను గైకొనుచు పూర్ణ హృదయముతో ఆయనను వెదకు వారు ధన్యులు.

–కీర్తనలు *119:2*

నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుటను ఉంచియున్నాను. కాబట్టి నీవును నీ సంతానమును బ్రతుకుచు, నీ ప్రాణమునకు మూలమైన నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లు జీవమును కోరుకొనుడి.

– ద్వితీయోపదేశ కాండము *30:19ఎ,20బి*

నేను బలిని కోరనుగాని కనికరమునే కోరుచున్నాను, దహన బలుల కంటె దేవుని గూర్చిన జ్ఞానము నాకిష్టమైనది. –హోషేయ *6:6*

దుప్పి నీటి వాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది.

–కీర్తనలు *42:1*

# దేవునికి వేరుగా నుండి జీవించుట హానికరము

.....మీరు యెహోవా పక్షపువారైన యెడల ఆయన మీ పక్షమున నుండును; మీరు ఆయన యొద్ద విచారణ చేసిన యెడల ఆయన మీకు ప్రత్యక్షమగును; మీరు ఆయనను విసర్జించిన యెడల ఆయన మిమ్మును విసర్జించును.

*–2 దిన వృత్తాంతములు 15:2బి*

హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది. దాని గ్రహింపగల వాడెవడు?

*– యిర్మీయా 17:9*

ఒకని మార్గము వాని దృష్టికి యదార్థముగా కనబడును. అయినను తుదకు అది మరణమునకు చేరును.

*–సామెతలు 16:25*

తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను. భక్తులను శోధనలో నుండి తప్పించుటకును, దుర్నీతిపరులను ముఖ్యముగా మలినమైన దురాశ కలిగి శరీరానుసారముగా నడుచుకొనుచు, ప్రభుత్వమును నిరాకరించుచు, శిక్షలో ఉంచబడినవారిని తీర్పు దినము వరకు కావలిలో ఉంచుటకును, ప్రభువు సమర్థుడు.

*–2 పేతురు 2:4,9,10*

అయితే యెహోవా మాట వినక ఆయన ఆజ్ఞను భంగము చేసిన యెడల యెహోవా హస్తము మీ పితురులకు విరోధముగా నుండినట్లు మీకును విరోధముగా నుండును.

*–1 సమూయేలు12:15*

# దేవున్ని ఎరుగుటకు ఆయనను వెదకవలెను

మీరు నన్ను వెదకిన యెడల, పూర్ణ మనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు. – యిర్మీయా *29:13*

అడుగుడి మీకియ్యబడును. వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును.

–మత్తయి *7:7*

విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా?

–హెబ్రీయులకు *11:6*

నన్ను ప్రేమించువారిని నేను ప్రేమించుచున్నాను. నన్ను జాగ్రత్తగా వెదకువారు నన్ను కనుగొందురు.

–సామెతలు *8:17*

తన్ను ఆశ్రయించువారి యెడల యెహోవా దయాళుడు తన్ను వెదకు వారి యెడల ఆయన దయచూపువాడు.

–విలాపవాక్యములు *3:25*

మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణకాలమును వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు.

–అపొస్తలుల కార్యములు *17:26-27*

# దేవుడు ఆయన యొద్దకు రమ్మని మనలను కోరుచున్నాడు

....మీ దేవుడైన యెహోవా కరుణాకటాక్షములు గలవాడు గనుక మీరు ఆయన వైపు తిరిగిన యెడల ఆయన మీ యందు ప్రసన్నుడగును.

– *2 దినవృత్తాంతములు 30:9బి*

ప్రభువా, నీవు దయాళుడవు క్షమించుటకు సిద్ధమైన మనస్సుగల వాడవు నీకు మొర్రపెట్టు వారందరి యెడల కృపాతిశయము గలవాడవు.

– *కీర్తనలు 86:5*

దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును........ – *యాకోబు 4:8ఎ*

తనకు మొర్రపెట్టు వారికందరికి, తనకు నిజముగా మొర్ర పెట్టు వారి కందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు. – *కీర్తనలు 145:18*

యెహోవా ఈమాట సెలవిచ్చుచున్నాడు – రండి మన వివాదము తీర్చుకొందము. మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమమువలె తెల్లబడును.

– *యెషయా 1:18ఎ*

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును.

– *మత్తయి 11:28*

.........నా యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను.

– *యోహాను 6:37బి*

# దేవుడు పరిశుద్ధుడు

యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు. పరిశుద్ధతను బట్టి నీవు మహానీయుడవు.........

*– నిర్గమకాండము 15:11ఎ*

యెహోవా వంటి పరిశుద్ధ దేవుడు ఒకడును లేడు. నీవు తప్ప మరి ఏ దేవుడును లేడు.

*– 1 సమూయేలు 2:2ఎ*

..........దేవుడు అన్యాయము చేయుట అసంభవము. సర్వశక్తుడు దుష్కార్యము చేయుట అసంభవము.

*– యోబు34:10బి*

........పరిశుద్ధుడు పరిశుద్ధుడు. సర్వ లోకము ఆయన మహిమతో నిండియున్నది.

*– యెషయా 6:3బి*

మహాఘనుడును, మహోన్నతుడును, పరిశుద్ధుడును నిత్య నివాసియునైన వాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు– నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములో నివసించువాడను.......

*– యెషయా 57:15ఎ*

యెహోవా తన మార్గములన్నిటిలో నీతి గలవాడు. తన క్రియలన్నిటిలో కృప చూపువాడు.

*– కీర్తనలు 145:17*

..........దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు.

*– మార్కు10:18బి*

దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి. వ్యర్థుడా, క్రియలు లేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా? మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి.

*–యాకోబు 2:19,20; 1:22*

ఆయనను ఎరిగియున్నానని చెప్పుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొన వాడు అబద్ధికుడు, వానిలో సత్యము లేదు. దీనిని బట్టి దేవుని పిల్లలెవరో అపవాది పిల్లలెవరో తేటపడును. నీతిని జరిగించని ప్రతివాడును, తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు

*–1 యోహాను 2:4,3:10*

భక్తిహీనుల మార్గము యెహోవాకు హేయము. నీతి ననుసరించువానిని ఆయన ప్రేమించును.

*–సామెతలు 15:9*

అందరితో సమాధానమును పరిశుద్ధతయు కలిగియుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు.

*–హెబ్రీయులకు 12:14*

నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడియున్నది.

*–1 పేతురు 1:14,15*

# దేవుడు ఆజ్ఞాపించు కొన్ని విషయములు

..... న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీన మనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు,ఇంతే గదా యెహోవా నిన్నడుగుచున్నాడు. – *మీకా 6:8బి*

......మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడనైయున్నాను.

– *లేవీయకాండము 19:2*

......నీ దేవుడైన **ప్రభువును** నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెననియు వ్రాయబడి యున్నదని చెప్పెను.

– *లూకా 10:27*

నరహత్య చేయవద్దు. వ్యభిచరింపవద్దు. దొంగిలవద్దు. అబద్ధసాక్ష్యము పలుకవద్దు. మోసపుచ్చవద్దు; నీ తల్లిదండ్రులను సన్మానింపుము.

– *మార్కు10:19*

ఈ ధర్మశాస్త్రగ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్థిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు.

– *యెహోషువ 1:8*

........మీరు దేవుని యందు విశ్వాసముంచుడి.

–*మార్కు 11:22బి*

# దేవుడు ద్వేషించు విషయములు

యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు ఏడును ఆయనకు హేయములు. అవేవనగా, అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును. – సామెతలు *6:16–19*

ఏలయనగా న్యాయము చేయుట యెహోవానగు నాకిష్టము. ఒకడు అన్యాయముగా ఒకని సొత్తు పట్టుకొనుట నాకసహ్యము. – యెషయా*61:8*

పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు; ఇది రెండవ మరణము.

– ప్రకటన *21:8*

.........కాగా మిమ్మును మీరే జాగ్రత్తచేసికొని, యౌవనమున పెండ్లి చేసికొనిన మీ భార్యల విషయములో విశ్వాఘాతకులుగా ఉండకుడి. భార్యను పరిత్యజించుట నాకు అసహ్యమైన క్రియ.........

– మలాకీ *2:15*బి. *16*ఎ

తన పొరుగు వాని మీద ఎవడును దుర్యోచన యోచింపకూడదు. అబద్ధ ప్రమాణము చేయ నిష్టపడకూడదు. ఇట్టివన్నియు నాకు అసహ్యములు; ఇదే యెహోవా వాక్కు. – జెకర్యా *8:17*

# దేవుని అపేక్షను ప్రజలు పొందలేకపోవుట

నేను మిమ్మును ఎరుగుదును;దేవుని ప్రేమ మీలో లేదు. *- యోహాను 5:42*

ఎవడైనను ధర్మశాస్త్ర మంతయు గైకొనియు, ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయిన యెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధి యగును.

*- యాకోబు 2:10*

కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును.

*- యాకోబు 4:17*

నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు.

*- రోమా 3:11*

ఏభేదమును లేదు. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. *- రోమా 3:23*

......నీతిని జరిగించని ప్రతివాడును, తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు. *- 1 యోహాను 3:10*

మన మందరము గొఱ్ఱెల వలె త్రోవ తప్పిపోతిమి మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. *- యెషయా 53:6ఎ*

.........పరిశుద్ధ దేవుడైన యెహోవా సన్నిధిని ఎవరు నిలువగలరు?

*- 1 సమూయేలు 6:20ఎ*

వారు దేవునియందు ఆసక్తి గలవారని వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు. ఏలయనగా వారు దేవుని నీతి నెరుగక తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు.

*– రోమా 10:2,3*

మేమందరము అపవిత్రుల వంటి వారమైతిమి. మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డవలె నాయెను.

*– యెషయా 64:6ఎ*

నీతిమంతుడు నిజముగా బ్రతుకునని నేను చెప్పినందున అతడు తన నీతిని ఆధారము చేసికొని పాపము చేసిన యెడల అతని నీతి క్రియలన్నిటిలో ఏదియు జ్ఞాపకమునకు తేబడదు, తాను చేసిన పాపమును బట్టి యతడు మరణము నొందును.

*– యెహెజ్కేలు 33:13*

కాగా శరీరస్వభావము గలవారు దేవుని సంతోషపరచనేరరు. *– రోమా 8:8*

ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు; –రోమా 3:20ఎ

మా వలన ఏదైన అయినట్లుగా ఆలోచించుటకు మాయంతట మేమే సమర్థులమని కాదు; మా సామర్థ్యము దేవుని వలననే కలిగియున్నది

*– 2 కొరింథీయులకు 3:5*

# పాపము మనలను దేవుని నుండి వేరు చేయును

ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్త మాయెను. – రోమా *5:12*

దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును.

– *యాకోబు 1:15*

పాపము చేయువాడే మరణము నొందును.

– *యెహెజ్కేలు 18:20ఎ*

మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు.

– *యెషయా 59:2*

యదార్థమైన నీతి జీవదాయకము, దుష్క్రియలు విడువక చేయువాడు తన మరణమునకే చేయును.

– *సామెతలు 11:19*

.......మీరెందుకు యెహోవా ఆజ్ఞలను మీరుచున్నారు? మీరు వర్ధిల్లరు; మీరు యెహోవాను విసర్జించితిరి గనుక ఆయన మిమ్మును విసర్జించి యున్నాడని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

– *2 దినవృత్తాంతములు 24:20బి*

తిరుగుబాటు చేయుట సోదె చెప్పుటయను పాపముతో సమానము; మూర్ఖతను అగపరచుట మాయా విగ్రహము గృహదేవతలను పూజించుటతో సమానము.

– *1 సమూయేలు 15:23ఎ*

న్యాయమును బట్టి ఆయన తీర్పు తీర్చును. ఆయన ప్రతిదినము కోపపడు దేవుడు.

– కీర్తనలు *7:11*

యెహోవా దీర్ఘశాంతుడు, మహాబలము గలవాడు, ఆయన దోషులను నిర్దోషులుగా ఎంచడు.

– నహూము *1:3ఎ*

వాటి వలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును. – కొలొస్సయులకు *3:6*

దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తి హీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము నుండి బయలు పరచబడుచున్నది – రోమా *1:18*

అట్టివారు సమస్తమైన దుర్నీతి చేతను, దుష్టత్వము చేతను, లోభము చేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్య కలహము కపటము వైరమనువాటితో నిండినవారై కొండెగాండ్రును అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకము లాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తల్లితండ్రులకవిధేయులును, అవివేకులును మాట తప్పువారును అనురాగ రహితులును, నిర్దయులునైరి. ఇట్టి కార్యములను అభ్యసించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగి యుండియు, వాటిని చేయుచున్నారు. ఇది మాత్రమే గాక వాటిని అభ్యసించువారితో సంతోషముగా సమ్మతించుచున్నారు.

– రోమా *1:29–32*

మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును.

– హెబ్రీయులకు *9:27*

మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమును వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథముల యందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి.

– ప్రకటన *20:12,15*

జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము.

– హెబ్రీయులకు *10:31*

నేను మీతో చెప్పునదేమనగా – మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును.

– మత్తయి *12:36*

గూఢమైన ప్రతి యంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదేగాని చెడ్డదేగాని, తీర్పులోనికి తెచ్చును.

– ప్రసంగి *12:14*

*ఆలాగే యుగసమాప్తియందు జరుగును. దేవదూతలు వచ్చి నీతిమంతులలో నుండి దుష్టులను వేరుపరచి, వీరని అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయును ఉండును.*

– మత్తయి *13:49,50*

# దేవుని యొద్ద నుండి మనము దాగియుండలేము

యెహోవా కన్నులు ప్రతి స్థలముమీద నుండును. చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును. – సామెతలు *15:3*

యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టక మునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొని యున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది.

– కీర్తనలు *139:1-4*

.......మనుష్యులు లక్ష్యపెట్టు వాటిని యెహోవా లక్ష్యపెట్టడు; నేను అతని త్రోసివేసియున్నాను. మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును.

– *1* సమూయేలు *16:7*బి

ఏలయనగా వారు పోయిన త్రోవలన్నిటి మీద దృష్టి యుంచితిని, ఏదియు నా కన్నులకు మరుగు కాలేదు, వారి దోషమును నాకు మరుగైయుండదు.

– యిర్మీయా *16:17*

మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్ప చెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా ఉన్నది. – హెబ్రీయులకు *4:13*

దుష్టులు మరణము నొందుటచేత నాకే మాత్రమైన సంతోషము కలుగునా? వారు తమ ప్రవర్తనను దిద్దుకొని బ్రతుకుటయే నాకు సంతోషము. – *యెహెజ్కేలు 18:23*

మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు. – *లూకా 13:3*

అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచి పెట్టువాడు కనికరము పొందును. – *సామెతలు 28:13*

ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు దుఃఖించుచు మనఃపూర్వకముగా తిరిగి నా యొద్దకు రండి. ఇదే యెహోవా వాక్కు. మీ దేవుడైన యెహోవా కరుణావాత్సల్యము గలవాడు. – *యోవేలు 2:12*

మాటలు సిద్ధపరచుకొని యెహోవా యొద్దకు తిరుగుడి; మీరు ఆయనతో చెప్పవలసినదేమనగా – మా పాపము లన్నింటిని పరిహరింపుము. – *హోషేయ 14:2ఎ*

అప్పుడు వాడు మనుష్యులయెదుట సంతోషించుచు ఇట్లని పలుకును – యదార్థమైన దానిని వ్యత్యాసపరచి నేను పాపము చేసితిని అయినను దానికి తగిన ప్రతికారము నాకు చేయబడలేదు కూపము లోనికి దిగి పోకుండ నా ప్రాణమును ఆయన విమోచించియున్నాడు. నా జీవము వెలుగును చూచుచున్నది. – *యోబు 33:27,28*

యెహోవా మీకు దొరుకు కాలమునందు ఆయనను వెదకుడి. ఆయన సమీపములో ఉండగా ఆయనను వేడుకొనుడి. భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారియందు జాలిపడును. వారు మన దేవునివైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును.

– *యెషయా 55:6,7*

విరిగిన హృదయము గలవారికి యెహోవా ఆసన్నుడు. నలిగిన మనస్సు గలవారిని ఆయన రక్షించును.

– *కీర్తనలు 34:18*

నా దోషమును కప్పుకొనక నీ యెదుట నా పాపము ఒప్పుకొంటిని – యెహోవా సన్నిధిని నా అతిక్రమములు ఒప్పుకొందు ననుకొంటిని. నీవు నా పాప దోషమును పరిహరించియున్నావు.

– *కీర్తనలు 32:5*

మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును.

– *1 యోహాను 1:9*

.......మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారు మనస్సు నొంది తిరుగుడి.

– *అపొస్తలుల కార్యములు 3:20బి*

# దేవునితో సమాధానపడుటకై బలియాగము అవసరము

అతడు దహనబలిగా అర్పించు పశువు తలమీద తన చెయ్యినుంచవలెను; అతని నిమిత్తము ప్రాయశ్చిత్తము కలుగునట్లు అది అతని పక్షముగా అంగీకరింపబడును. రక్తము దేహమునకు ప్రాణము. మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని. రక్తము దానిలో నున్న ప్రాణమును బట్టి ప్రాయశ్చిత్తము చేయును.

– లేవీయకాండము *1:4,17:11*

మరియు ధర్మశాస్త్ర ప్రకారము సమస్త వస్తువులును రక్తము చేత శుద్ధి చేయబడుననియు, రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును.

– హెబ్రీయులకు *9:22*

నిర్దోషమైన యేడాది మగ పిల్లను తీసికొనవలెను. మీరున్న యిండ్ల మీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింపచేయక దాటి పోయెదను. మిమ్ము సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు.

– నిర్గమకాండము *12:6ఎ13*

అబ్రాహాము – నా కుమారుడా, దేవుడే దహన బలికి గొర్రెపిల్లను చూచుకొనునని చెప్పెను. అప్పుడు అబ్రాహాము కన్నులెత్తి చూడగా పొదలో కొమ్ములు తగులుకొనియున్న ఒక పొట్టేలు వెనుక తట్టున కనబడెను. అబ్రాహాము వెళ్లి ఆ పొట్టేలును పట్టుకొని తన కుమారునికి మారుగా పెట్టి దహనబలిగా అర్పించెను.

– ఆదికాండము *22:8,13*

# యేసు దేవుని వలన యివ్వబడిన గొఱ్ఱెపిల్ల

మరునాడు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి – ఇదిగో లోకపాపమును మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల.

– *యోహాను 1:29*

మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను. ఆలాగుననే క్రీస్తుకూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడెను.

– *హెబ్రీయులకు 9:12,28ఎ*

పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని అమూల్యమైన రక్తము చేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు, గొఱ్ఱెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా!

– *1 పేతురు 1:18,19*

నిత్యుడగు **ఆత్మ** ద్వారా తన్ను తాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధి చేయును.

– *హెబ్రీయులకు 9:14*

కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. ఆయన తన నీతిని కనుపరచవలెనని క్రీస్తు యేసు రక్తము నందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. – రోమా *3:24,25బి,26ఎ*

అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతి మంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము.

– రోమా *5:8,9*

మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. – ఎఫెసీ *2:8*

ఆయన యందు విశ్వాసముంచు వాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాప క్షమాపణ పొందునని ప్రవక్తలందరు ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నారనెను.

– అపొస్తలుల కార్యములు *10:43*

మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము.

– అపొస్తలుల కార్యములు *4:12*

# యేసుక్రీస్తు జననము ప్రకటించబడుట

ఆరవ నెలలో గబ్రియేలను దేవదూత గలిలయ లోని నజరేతను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యక యొద్దకు దేవునిచేత పంపబడెను. ఆ కన్యక పేరు మరియ. ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి – దయాప్రాప్తులారా నీకు శుభము; ప్రభువు నీకు తోడైయున్నాడని చెప్పెను. ఆమె ఆ మాటకు బహుగా తొందరపడి – ఈశుభవచన మేమిటో అని ఆలోచించుకొను చుండగా దూత –మరియా, భయపడకుము; దేవుని వలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని ఆమెతో చెప్పెను. అందుకు మరియ – నేను పురుషుని ఎరుగని దాననే; యిదేలాగు జరుగునని దూతతో అనగా దూత – పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారు డనబడును. మరియు నీ బంధువురాలు ఎలీసబెతు కూడ తన వృద్ధాప్య మందు ఒక కుమారుని గర్భము ధరించి యున్నది. – లూకా *1:26–37*

(ప్రపంచములో ప్రవేశించిన పురుషులలో స్త్రీ, పురుష సంపర్కము లేకుండ వచ్చిన వారు ఆదాము, క్రీస్తు అనువారు మాత్రవే. ఆదాము యీ లోకమునకు పాపమును తెచ్చెను. అయితే క్రీస్తు ఆ పాపముపై విజయమును తెచ్చెను)

ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడదని భాగ్యమని యెంచుకొనలేదు.

– ఫిలిప్పీయులకు *2:6*

నేనును తండ్రియును ఏకమై యున్నామని వారితో చెప్పెను. తండ్రి ప్రతిష్ఠ చేసి యీ లోకములోనికి పంపినవానితో – నీవు దేవదూషణ చేయుచున్నావని చెప్పుదురా?

(నిత్యవాక్కు అయిన యేసుక్రీస్తు ఎల్లప్పుడును జీవించియే యుండెను. దేవుడు తన గొప్ప అద్భుతము ద్వారా ఆయనను మరియ గర్భమున ధరింపజేసెను. శారీరకముగా ఆయన మనుష్య కుమారుడై, ఆత్మీయముగా దేవుని కుమారుడై యుండెను. దేవునికిని వాక్కు రూపములో యున్న యేసుక్రీస్తుకును గల సంబంధమును, తెలియ పరచుటకై లేఖనములు "కుమారుడు" అని పిలుచుటలో తెలియపర్చబడెను)

– యోహాను *10:30,36*

కాబట్టి ఆయన యీ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పుచున్నాడు – బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి.

– హెబ్రీయులకు *10:5*

యేసుక్రీస్తు, శరీరమును బట్టి దావీదు సంతానముగాను, మృతులలో నుండి పునరుత్థానుడై నందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడు గాను ప్రభావముతో నిరూపింపబడెను. – రోమా *1:4*

నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది. ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. *–1 తిమోతి 3:16ఎ*

ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది.

– కొలొస్సయులకు *2:9*

ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్య భారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచన కర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును. – యెషయా *9:6*

యేసు – అబ్రాహాము పుట్టక మునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

– *యోహాను 8:58*

ఆయన లోకములో ఉండెను, లోకమాయన మూలముగా కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు. – *యోహాను 1:10*

దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్య వర్తియు ఒక్కడే ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరి కొరకు విమోచన క్రయ ధనముగా తన్ను తానే సమర్పించుకొనెను.

*– 1 తిమోతి 2:5,6ఎ*

ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. ఆయన అదృశ్యదేవుని స్వరూపియై యుండెను.

– కొలొస్సయులకు *1:14,15ఎ*

# బైబిలు (లేఖనములు) దేవుని వాక్యము

ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి. *– 2 పేతురు 1:21*

యెహోవా ఆత్మ నాద్వారా పలుకుచున్నాడు ఆయన వాక్కు నానోట ఉన్నది.

*– 2 సమూయేలు 23:2*

దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతి యందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది.

*– 2 తిమోతి 3:17*

ఏలయనగా ఓర్పు వలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి.

*– రోమా 15:4*

........లేఖనములను గాని దేవుని శక్తిని గాని ఎరుగక మీరు పొరబడుచున్నారు.

*– మత్తయి 22:29బి*

.........నీ నామమంతటి కంటె నీ విచ్చిన వాక్యమును నీవు గొప్ప చేసియున్నావు.

*– కీర్తనలు 138:2బి*

రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొని యుండెను. మరియు దేవుని వాక్యము అను నామము ఆయనకు పెట్టబడి యున్నది.

– *ప్రకటన 19:13*

ఆది యందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెను. ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను.

– *యోహాను 1:1,14ఎ*

## క్రీస్తు దేవుని బయలు పర్చును

ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను.

– *యోహాను 1:18*

## క్రీస్తు ద్వారా దేవుడు మాట్లాడును

పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితురులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను

– *హెబ్రీయులకు 1:1,2*

నేను నా తండ్రియొద్ద చూచిన సంగతులే బోధించుచున్నాను.

– *యోహాను 8:38*

## బైబిలు ఆత్మకు ఆహారము

........మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటలవలనను జీవించును.

– మత్తయి *4:4బి*

## బైబిలు మన త్రోవలను వెలిగించును

నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది.

– కీర్తనలు *119:105*

నీ వాక్యములు వెల్లడి అగుట తోడనే వెలుగు కలుగును. అవి తెలివి లేని వారికి తెలివి కలిగించును.

– కీర్తనలు *119:130*

యేసుక్రీస్తు పరలోకము నుండి వచ్చిన ఆహారము

పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారమును నేనే. ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును.

– యోహాను *6:51*

## యేసుక్రీస్తు లోకమునకు వెలుగైయున్నాడు

మరల యేసు – నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండునని వారితో చెప్పెను.

– యోహాను *8:12*

## బైబిలు గ్రంథము సఫలమైన జీవము నిచ్చును

యెహోవా ధర్మశాస్త్రము నందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. – *కీర్తనలు 1:2,3*

## యేసుక్రీస్తు ఫలవంతమైన జీవము నిచ్చును

నాయందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచి యుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి యుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనే గాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవని యందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు.

– యోహాను 15:4,5

## లేఖనములు యేసుక్రీస్తును గూర్చి తెలియజేయును

లేఖనముల యందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి. – *యోహాను 5:39*

మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భావము వారికి తెలిపెను. – *లూకా 24:27*

# దేవుని నిత్యమైన వాక్యము ఎన్నడును మారదు

యెహోవా, నీ వాక్యము ఆకాశమందు నిత్యము నిలకడగా నున్నది. నీ వాక్య సారాంశము సత్యము. నీవు నియమించిన న్యాయవిధులన్నియు నిత్యము నిలుచును. – కీర్తనలు *119:89,160*

గడ్డి యెండిపోవును దాని పువ్వు వాడిపోవును. మన దేవుని వాక్యము నిత్యము నిలుచును.

– యెషయా *40:8*

ఆకాశమును భూమియు గతించి పోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.

– మత్తయి *5:18*

## మానవుడు బైబిలు గ్రంథమును మార్చ తెగించరాదు

ఆయన మాటలతో ఏమియు చేర్చకుము, ఆయన నిన్ను గద్దించునేమో అప్పుడు నీవు అబద్ధికుడ వగుదువు.

– సామెతలు *30:6*

ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవ వృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును.

– ప్రకటన 22:19

నేను దాని మరల తీసికొనునట్లు ప్రాణము పెట్టుచున్నాను; ఇందువలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు.

– యోహాను *10:17,18ఎ*

ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహముల కంటె ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొనుచున్నావా? –ఈలాగు జరుగవలెనను లేఖనము ఏలాగు నెరవేరునని అతనితో చెప్పెను.

– మత్తయి *26:53,54*

అయితే దేవుడు తన క్రీస్తు శ్రమపడునని సమస్త ప్రవక్తల నోట ముందుగా ప్రచురపరచిన విషయములను ఈలాగు నెరవేర్చెను.

– అపొస్తలుల కార్యములు *3:18*

అతని నలుగ గొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తన్ను తానే అపరాధ పరిహారార్థ బలి చేయగా అతని సంతానము చూచును.

– యెషయా *53:10ఎ*

# యేసుక్రీస్తు మరణము సాక్ష్యముల ద్వారా తెలియజేయబడెను

మరియు కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఇద్దరు బందిపోటు దొంగలను ఆయనతో కూడ సిలువ వేసిరి. అప్పుడు ఆయన అక్రమ కారులలో నొకడుగా నెంచబడెనని చెప్పు లేఖనము నెరవేరినది. *– మార్కు 15:27;యెషయా 53:12*

యేసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెర పై నుండి క్రింది వరకు రెండుగా చినిగెను; భూమి వణకెను. బండలు బ్రద్ధలాయెను; శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలి యున్నవారును, భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి, మిక్కిలి భయపడి – నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి. *– మత్తయి 27:50,51,54*

వారు యేసు నొద్దకు వచ్చి, అంతకు ముందే ఆయన మృతి పొందియుండుట చూచి ఆయన కాళ్లు విరుగ గొట్టలేదు గాని సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును నీళ్లును కారెను. ఇది చూచినవాడు సాక్ష్యమిచ్చుచున్నాడు; అతని సాక్ష్యము సత్యమే. మీరు నమ్మునట్లు అతడు సత్యము చెప్పుచున్నాడని ఆయనెరుగును – అతని యెముకలలో ఒకటైనను విరువబడదు అను లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను. మరియు – తాము పొడిచిన వాని తట్టు చూతురు అని మరియొక లేఖనము చెప్పుచున్నది.

*– యోహాను 19:33–37*

# యేసు మరణమును జయించెను

మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను. ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము.

– అపొస్తలుల కార్యము *2:24,32*

కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారై నందున ఆ ప్రకారమే మరణము యొక్క బలముగల వానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవిత కాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును, ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను.

– హెబ్రీయులకు *2:14,15*

నేను మొదటివాడను కడపటివాడను జీవించు వాడను; మృతుడనైతిని గాని ఇదిగో యుగ యుగములు సజీవుడనై యున్నాను. మరియు మరణము యొక్కయు పాతాళలోకము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి.

– ప్రకటన *1:18*

అనాదికాలముననే క్రీస్తుయేసు నందు మనకు అనుగ్రహింపబడినదియు, క్రీస్తుయేసను మన రక్షకుని ప్రత్యక్షత వలన బయలుపరచబడినదియునైన తన కృపను బట్టియు, మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తు యేసు, మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను.

–2 తిమోతి *1:10*

ఇదిగో నేను తలుపు నొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము. – *ప్రకటన 3:20*

.......పరిశుద్ధాత్మను పొందుడి....మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి, మీకు దొరకును. – *యోహాను 20:22బి. 16:24బి*

–యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయ మందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు. –*రోమా 10:9*

తండ్రినైనను తల్లినైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; అప్పుడు యేసు తన శిష్యులను చూచి ఎవడైనను నన్ను వెంబడింప గోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించు కొని, తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను. తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దాని పోగొట్టుకొనును; నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును. – *మత్తయి 10:37ఎ;16:24,25*

మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులై యున్నారు. – *గలతీయులకు 3:29*

ఆ సాక్ష్యమేమనగా - దేవుడు మనకు నిత్య జీవము దయచేసెను; ఈ జీవము ఆయన కుమారుని యందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు; దేవుని కుమారుని అంగీకరింపని వాడు జీవము లేనివాడే.

*–1 యోహాను 5:11,12*

నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించువాడను నేనుకాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను.

*– గలతీయులకు 2:20*

క్రీస్తు యేసు నందు జీవము నిచ్చు ఆత్మ యొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను.

*– రోమా 8:2*

కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను.

*– 2 కొరింథీయులకు 5:17*

మీరు క్షయ బీజము నుండి కాక, శాశ్వతమగు జీవము గల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు.

*–1 పేతురు 1:22*

# దేవుడు తన ప్రజలకు తండ్రియై యున్నాడు

తన పరిశుద్ధాలయమందుండు దేవుడు, తండ్రి లేనివారికి తండ్రియు, విధవరాండ్రకు న్యాయకర్తయునై యున్నాడు. – *కీర్తనలు 68:5*

యెహోవా, నీవే మాకు తండ్రివి. మేము జిగట మన్ను నీవు మాకు కుమ్మరివాడవు. మేమందరము నీ చేతి పనియై యున్నాము.......యెహోవా, నీవే మా తండ్రివి, అనాది కాలము నుండి మా విమోచకుడని నీకు పేరేగదా!

– *యెషయా 64:8;63:16బి*

మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగియుండగా పరలోక మందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును. కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి, – పరలోక మందున్న మా తండ్రీ నీ నామము పరిశుద్ధ పరచబడు గాక ....... – *మత్తయి 7:11;6:9,10ఎ*

– నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నా ప్రజలై యుందురు. – మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినై యుందును మీరు, నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు.

– *2 కొరింథీయులకు 6:18*

యేసు - నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు. మీరు నన్ను ఎరిగియుంటే నా తండ్రిని ఎరిగియుందురు; ఇప్పటి నుండి మీరాయనను ఎరుగుదురు, ఆయనను చూచి యున్నారని చెప్పెను. యేసు– ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును. అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకు వచ్చి వాని యొద్ద నివాసము చేతుము.

*– యోహాను 14:6,7,23*

అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు.

*– గలతీయులకు 4:4–5;3:26*

తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామము నందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను.

*– యోహాను 1:12*

.....ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు.

*– 1 యోహాను 2:1బి*

# యేసుక్రీస్తు ప్రేమ, సంతోషము, సమాధానము తెచ్చును

దేవుడు ప్రేమ స్వరూపి, ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు.... దేవుడు ప్రేమ స్వరూపియై యున్నాడు, ప్రేమయందు నిలిచియుండువాడు దేవుని యందు నిలిచియున్నాడు, దేవుడు వానియందు నిలిచియున్నాడు. *– 1 యోహాను 4:8,16బి*

ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకనినొకరు క్షమించుడి.

*– ఎఫెసీయులకు4:32*

మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీని బట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను. *– యోహాను 13:35*

అయితే **ఆత్మ** ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము.....

*– గలతీయులకు 5:22ఎ*

కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగి యుందము. *– రోమా 5:1*

శాంతి మీకనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను; లోకమిచ్చు నట్టుగా నేను మీకనుగ్రహించుట లేదు; మీ హృదయమును కలవరపడ నియ్యకుడి, వెరవ నియ్యకుడి.

*– యోహాను 14:27*

మృతులలో నుండి యేసును లేపిన వాని ఆత్మ మీలో నివసించిన యెడల, మృతులలో నుండి క్రీస్తుయేసును లేపిన వాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును. *– రోమా 8:11*

దేవుడు ప్రభువును లేపెను; మనలను కూడ తన శక్తివలన లేపును.

*– 1 కొరింథీయులకు 6:14*

కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్య జీవము పొందుటయే నా తండ్రి చిత్తము; అంత్య దినమున నేను వానిని లేపుదును. *– యోహాను 6:40*

మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రతికింపబడును. ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రతికింపబడుదురు.

*– 1 కొరింథీయులకు 15:21–23*

నేను జీవించుచున్నాను గనుక మీరును జీవింతురు.

*– యోహాను 14:19బి*

ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించిన యెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాట మీద, కనికరింపకుండ వాని చంపించుదురు. ఇట్లుండగా దేవుని కుమారుని, పాదములతో త్రొక్కి, తాను పరిశుద్ధ పరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి, కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును? – హెబ్రీయులకు *10:28,29*

నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును.

– యోహాను *12:48*

కాగా మీ పాపములలోనేయుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను.

– యోహాను *8:24*

నా స్నేహితులైన మీతో నేను చెప్పునదేమనగా – దేహమును చంపిన తరువాత మరేమియు చేయనేరని వారికి భయపడకుడి. ఎవనికి మీరు భయపడవలెనో మీకు తెలియజేయుదును; చంపిన తరువాత నరకములో పడద్రోయ శక్తిగలవానికి భయపడుడి, ఆయనకే భయపడుడని మీతో చెప్పుచున్నాను. – లూకా*12:4,5*

ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు.

– అపొస్తలుల కార్యములు *17:31ఎ*

తండ్రి యెవనికిని తీర్పు తీర్చడుగాని తండ్రిని ఘనపరచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు.

– *యోహాను 5:22,23ఎ*

ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును.

– *2 కొరింథీయులకు 5:10*

........యేసుక్రీస్తు ద్వారా మనుష్యుల రహస్యములను విమర్శించు దినమందు ఈలాగు జరుగును.

– *రోమా 2:16బి*

ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయును.

– *2 థెస్సలొనీకయులకు 1:6–8ఎ*

దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని..... తమ క్రియల వలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు. – *తీతుకు 1:16*

........ఎవడైనను క్రీస్తు ఆత్మ లేనివాడైతే వాడాయన వాడు కాడు. – *రోమా 8:9బి*

నాజనులైనట్టుగా నీ యెదుట కూర్చుండి నీ మాటలు విందురు గాని వాటి ననుసరించి ప్రవర్తింపరు, వారు నోటితో ఎంతో ప్రేమ కనుపరచుదురు గాని వారి హృదయము లాభమును ఆపేక్షించుచున్నది. – *యెహెజ్కేలు 33:31బి*

ఈప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. – *మత్తయి 15:8*

ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశంపడు గాని పరలోక మందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్ను చూచి – ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు – నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును.

– *మత్తయి 7:21–23*

మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనిన యెడల, దీనివలననే ఆయనను ఎరిగి యున్నామని తెలిసికొందుము. *– 1 యోహాను 2:3*

నా ఆత్మను మీయందుంచి, నా కట్టడల ననుసరించువారిని గాను నా విధులను గైకొను వారినిగాను మిమ్మును చేసెదను.

*– యెహెజ్కేలు 36:27*

మరియు ఆయన సంపూర్ణ సిద్ధి పొందినవాడై .......తనకు విధేయులైన వారకందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను.

*– హెబ్రీయులకు 5:9ఎ,10*

పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. *– రోమా 6:18*

మరియు వాటి యందు మనము నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయుటకై, మనము క్రీస్తుయేసు నందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియై యున్నాము. *– ఎఫెసీయులకు 2:10*

మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై యుందురు గాని ఆత్మచేత శారీరక్రియలను చంపిన యెడల జీవించెదరు.

*– రోమా 8:13*

– ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతి నుండి తొలగిపోవలెను.

*– 2 తిమోతికి 2:19బి*

# యేసును వెంబడించు వారిని లోకము ద్వేషించును

లోకము మిమ్మును ద్వేషించిన యెడల మీకంటె ముందుగా నన్ను ద్వేషించెనని మీరెరుగుదురు. మీరు లోక సంబంధులైన యెడల లోకము తన వారిని స్నేహించును; అయితే మీరు లోక సంబంధులు కారు; నేను మిమ్మును లోకములో నుండి ఏర్పరచుకొంటిని; అందుచేతనే లోకము మిమ్మును ద్వేషించుచున్నది. – *యోహాను 15:18,19*

....మిమ్మును చంపు ప్రతివాడు తాను దేవునికి సేవ చేయుచున్నానని అనుకొను కాలము వచ్చుచున్నది. వారు తండ్రిని నన్నును తెలిసికొనలేదు గనుక ఈలాగు చేయుదురు.

– *యోహాను 16:2బి,3*

....అనేక శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెననియు వారిని హెచ్చరించిరి.

– అపొస్తలుల కార్యములు *14:22బి*

క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రదక నుద్దేశించువారందరు హింస పొందుదురు;

– *2 తిమోతి 3:12*

...లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను. – *యోహాను 16:33బి*

# హింసలు పొందువారికి వాగ్దానములు

భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును.

– *యెషయా 41:10*

నా తల్లితండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును.

– *కీర్తనలు 27:10*

కాబట్టి – ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను. నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము.

– *హెబ్రీయులకు 13:6*

నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలను ఆజ్ఞాపించును. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు.

– *కీర్తనలు 91:11;23:4ఎ*

నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను. కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును.

– *ఫిలిప్పీయులకు 4:13,19*

సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింప గలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును.

*–1 కొరింథీయులకు 10:13*

గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము.

*– హెబ్రీయులకు 4:16*

అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును.

*– 1 యోహాను 1:7*

కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును.

*– యాకోబు 4:7*

నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను.

*– కీర్తనలు 119:11*

నా సన్నిధి వెదకుడని నీవు సెలవియ్యగా - యెహోవా, నీ సన్నిధి నేను వెదకెదనని నా హృదయము నీతో అనెను. *- కీర్తనలు 27:8*

జనులారా, యెల్లప్పుడు ఆయన యందు నమ్మికయుంచుడి ఆయన సన్నిధిని మీ హృదయములు కుమ్మరించుడి దేవుడు మనకు ఆశ్రయము. *- కీర్తనలు 62:8*

యెహోవా, నీవు నన్ను స్వస్థపరచుము నేను స్వస్థత నొందుదును, నన్ను రక్షించుము నేను రక్షింపబడుదును, నేను నిన్ను స్తోత్రించుటకు నీవే కారణభూతుడవు. *- యిర్మీయా 17:14*

యెడతెగక ప్రార్థన చేయుడి; ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తు నందు మీ విషయములో దేవుని చిత్తము. *- 1 థెస్సలొనీకయులకు 5:17,18*

నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచి యుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును. *- యోహాను 15:7*

నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును. యెహోవా, నా పాపము బహు ఘోరమైనది. నీ నామమును బట్టి దానిని క్షమింపుము. *- కీర్తనలు 66:18,25:11*

ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము.

– *1 థెస్సలొనీకయులకు 4:16,17*

ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము.

– *2 కొరింథీయులకు 7:1*

ప్రభువు రాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగియుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి. సహోదరులా, మీరు తీర్పు పొందకుండు నిమిత్తము ఒకనిమీద నొకడు సణగకుడి; ఇదిగో న్యాయాధిపతి వాకిట నిలిచి యున్నాడు.

– *యాకోబు 5:8,9*

మీరు అనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుక మీరును సిద్ధముగా ఉండుడని చెప్పెను.

– *లూకా 12:40*

# దైవాత్మతో నింపబడియుండుడి

నా గద్దింపు విని తిరుగుడి ఆలకించుడి నా ఆత్మను మీమీద కుమ్మరించుదును. నా ఉపదేశమును మీకు తెలిపెదను.

–సామెతలు 1:23

....... ఎవడైనను క్రీస్తు ఆత్మలేనివాడైతే వాడాయనవాడు కాడు. దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. – రోమా 8:9బి,14

మరియు మద్యముతో మత్తులైయుండకుడి. దానిలో దుర్వ్యాపారముకలదు; అయితే ఆత్మ పూర్ణులై యుండుడి. ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుచు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, క్రీస్తు నందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి.

–ఎఫెసీయులకు 5:18–21

మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? మీరు విలువపెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి.

–1 కొరింథీయులకు 3:16,6:20

ఉచితము — అమ్మబడదు

www.wmpress.org



Read booklets online or by App
www.wmp-readonline.org

1514 Telugu HKG